సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




శుక్రవారం 10 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 312 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలు విడుదల

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రతినిధి: రాష్ట్ర ఆరోగ్యశాఖలో మరో భారీ నియామక ప్రక్రియ పూర్తయింది. మొత్తం 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల తుది ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచగా, పారదర్శకత కోసం పరీక్ష రాసిన సుమారు 42 వేల మంది అభ్యర్థుల వివరాలను కూడా ప్రకటించింది. ఇప్పటికే 2024లో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, తాజా నియామకాలతో కలిపి ప్రభుత్వ ఆసుపత్రుల్లో నర్సుల కొరత పూర్తిగా తీరినట్టేనని అధికారులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్యారోగ్య శాఖలో ఖాళీల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించగా, మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో రికార్డు స్థాయిలో 12,649 పోస్టుల భర్తీ పూర్తయింది. డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితర అన్ని విభాగాల్లో నియామకాలు జరగడంతో ప్రభుత్వ వైద్య సేవలు బలోపేతం అయ్యాయి. మరో 4500 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతుండగా, అవసరమైన భవనాలు, వైద్య సిబ్బంది, పరికరాలు, ఔషధాలు వంటి అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. జిల్లాల స్థాయిలోనే స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు కొత్త పీజీ సెంటర్ల ఏర్పాటుకు కూడా చర్యలు కొనసాగుతున్నాయి.

# హెచ్ఐవీపై అవగాహనకు మానవహారం..

## జైళ్లలో ఆరోగ్య క్యాంపుల ప్రారంభం





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రతినిధి: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై సమాజంలో విస్తృత అవగాహన కల్పించేందుకు తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో కేబుల్ బ్రిడ్జ్‌పై నిర్వహించిన మానవహారం కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, మానవహారాలు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. హెచ్ఐవీ అనేది శరీరంలోని రోగనిరోధక శక్తిని బలహీనపరచే వైరస్ అని, చికిత్స తీసుకోకపోతే ఎయిడ్స్‌గా మారుతుందని వివరించారు. రక్షణలేని లైంగిక సంబంధాలు, కలుషిత రక్త మార్పిడి ద్వారా వైరస్ వ్యాపిస్తుందని, అయితే షేక్ హ్యాండ్, ఆలింగనం, కలిసి భోజనం చేయడం వంటి సాధారణ పరిచయాల ద్వారా వ్యాపించదని స్పష్టం చేశారు. అవగాహన లేకపోవడం వల్లే భయాలు, అపోహలు పెరుగుతున్నాయని, బాధితులను వివక్ష చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ప్రస్తుతం సరైన పరీక్షలు, చికిత్సతో హెచ్ఐవీ బాధితులు దీర్ఘకాలం సాధారణ జీవితం గడపవచ్చని తెలిపారు. రాష్ట్రంలో 127 టెస్టింగ్ సెంటర్లు, 33 ART కేంద్రాల ద్వారా లక్షకు పైగా పేషెంట్లకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. యువత అనారోగ్యకర అలవాట్లకు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన 3 రోజుల మెడికల్ క్యాంపును మంత్రి ప్రారంభించారు. ఖైదీలకు హెచ్ఐవీ, టీబీ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి జైళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్లతో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతి పౌరునికి మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.



## ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా నివాళులు

సందేశం టైమ్స్, అనంతపురం, ఏప్రిల్ 10, ప్రతినిధి: పేద ప్రజలకు దేవుడిచ్చిన వరంగా నిలిచిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని సేవాస్ఫూర్తికి ఘనంగా నివాళులు అర్పించారు. అర్ధ శతాబ్దం క్రితం తెలుగునేలపై అడుగుపెట్టి రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ స్థాపించి అనంత ప్రాంత ప్రజలకు ఆశాజ్యోతిగా మారిన ఆయన, తెలుగు రాష్ట్రాల్లో ఆసుపత్రులు, విద్యాలయాలు, స్వయం సహాయక సంఘాలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు నిరుపేదలకు పక్కా గృహాల నిర్మాణం ద్వారా ప్రగతి ప్రదాతగా నిలిచారు. ఈ ఏడాది ఆయన జయంతి కానుకగా ఆర్డీటీకి విదేశీ నిధుల నియంత్రణ చట్టం అనుమతి సాధించడంతో ప్రజలకు నిరంతరాయంగా సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నిస్వార్థ సేవతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌ను స్మరిస్తూ ఘన నివాళులు అర్పించారు.

# కాకినాడ అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి

## ప్రతి రెండు నెలలకు జిల్లా పర్యటనలు.. ప్రజల సమస్యల పరిష్కారానికి హామీ





సందేశం టైమ్స్, మంగళగిరి, ఏప్రిల్ 10, ప్రతినిధి: కాకినాడ జిల్లా అభివృద్ధిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇకపై ప్రతి రెండు నెలలకు ఒకసారి కాకినాడ, పిఠాపురం నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంద్రప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్‌లతో సమావేశమై జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై పలు కీలక దిశానిర్దేశాలు చేశారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, డొంక రోడ్ల అభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని, నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని ఆదేశించారు. జిల్లా పరిధిలో రోడ్లన్నీ మెరుగుపరచి గుంతలు లేకుండా చూడాలని, ధ్వంసమైన రోడ్లను పునర్నిర్మించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలపై పర్యవేక్షణ పెంచి వసతులను మెరుగుపరచాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. గ్రామ స్థాయిలో పార్కులు, పాఠశాలలు, హాస్టళ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, యువతకు క్రీడలు, కళలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించాలని పేర్కొన్నారు. గ్రంథాలయాలను బలోపేతం చేసి యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వర్షాకాలానికి ముందే తీర ప్రాంతం వెంబడి గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును పూర్తి చేయాలని అటవీ అధికారులను ఆదేశించారు. అదే విధంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, రేషన్ మాఫియాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించారు.

# మీ భూమి-మీ హక్కు'లో సీఎం చంద్రబాబు రైతులకు కొత్త పాసుపుస్తకాల పంపిణీ



సందేశం టైమ్స్, బాపట్ల జిల్లా, ఏప్రిల్ 10, ప్రతినిధి: ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గురువారం బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని సూరేపల్లిలో నిర్వహించిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ సర్వేయర్ స్వప్నతో కలిసి రైతులు వాకా శ్రీనివాసరావు, మూరల వెంకటేశ్వర్లకు చెందిన పొలాల వద్దకు వెళ్లి భూసంబంధిత వివరాలను పరిశీలించారు. గత ప్రభుత్వంలో జరిగిన లోపాలను సరిదిద్దుతూ, జగన్ ఫోటోతో ఇచ్చిన పాత పట్టాదారు పాసుపుస్తకాలకు బదులుగా క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త పుస్తకాలను రైతులకు అందించారు. సర్వే నంబరు, ఖాతా నంబరు సరిగా ఉన్నాయా అని స్వయంగా రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను ముఖ్యమంత్రి అందజేశారు.

# కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులకు వేగం.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రతినిధి: కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలను మరమ్మతులు చేసి త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించిన సీఎం, మరమ్మతుల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టెంట్లతో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. మేడిగడ్డ వద్ద కుంగిపోయిన పిల్లర్ మాత్రమే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజీని అధ్యయనం చేయాలని ఇంజనీర్లు సూచించగా, దీనిపై సమగ్ర చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మేడిగడ్డ వద్ద 500 బోర్ బావులు తవ్వేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, అవసరమైన యంత్రాలను సమకూర్చుకోవాలని తెలిపారు. డిసెంబర్ వరకు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ రూపొందించి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, పనులు ప్రారంభమైన తర్వాత తానే స్వయంగా పరిశీలిస్తానని సీఎం తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్, సీఎం కార్యదర్శి మానిక్ రాజ్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గ్రూప్-1లో సత్తా చాటిన గిరిజన యువతి పావని



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 10, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం కొండాపూర్ తాండకు చెందిన రాథోడ్ పావని గ్రూప్-1 పరీక్షలో ప్రతిభ కనబర్చి ఇనకమ్ ట్యాక్స్ సూపరింటెండెంట్‌గా ఎంపికై గిరిజన సమాజానికి గర్వకారణంగా నిలిచింది. ఆమె తండ్రి నందు సింగ్ ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచే చదువులో మెరుగైన ప్రతిభ కనబరిచిన పావని నారాయణఖేడ్‌లోని విజ్ఞాన్ టాలెంట్ ప్రైవేట్ పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, అనంతరం సంగారెడ్డిలోని సెంట్ జోన్ పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు ప్రతి తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించి కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరులోని ఎన్ఐటి విద్యాసంస్థలో ఉన్నత విద్యను పూర్తిచేసి, తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో తన ప్రతిభను చాటుతూ ఈ ఘనత సాధించింది. గిరిజన కుటుంబానికి చెందిన పావని విజయంపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, ఆమెను ఆదర్శంగా తీసుకుని గిరిజన విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనలో ముందుకు సాగాలని పెద్దలు సూచిస్తున్నారు.




# ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్యానికి ప్రత్యేక శిబిరాలు అవసరం అదనపు కలెక్టర్ పాండు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 10, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హెల్త్ వీక్ కార్యక్రమంలో భాగంగా ట్రాన్స్‌జెండర్ల కోసం నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని అదనపు కలెక్టర్ పాండు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ సమాజ ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి అవసరమని, అవసరమైన పరీక్షలు, చికిత్సలు అందించేందుకు ఇలాంటి శిబిరాలు కీలకమని తెలిపారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డాక్టర్ శశాంక్ తదితర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జోగిపేటలో ఆర్టినాస్ ఆందోళనకు బీజేపీ మద్దతు



సందేశం టైమ్స్, అందోల్ మండలం, ఏప్రిల్ 10, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని జోగిపేటలో ఆర్టినాస్ కార్యకర్తలు చేపట్టిన ఆందోళనకు భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసనకు సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు పులుగు గోపాల్ మాట్లాడుతూ, ఆర్టినాస్ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# బేటి బచావో-బేటి పడావో కింద మహిళలకు కుట్టు యంత్రాలు, శిక్షణ ప్రారంభం




సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 10, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదంగా బేటి బచావో-బేటి పడావో పథకం కింద కుట్టు యంత్రాల పంపిణీతో పాటు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక బాలసదనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 50 మంది లబ్ధిదారులకు కుట్టు యంత్రాలు పంపిణీ చేయగా, 25 మందికి బ్యూటీషియన్ శిక్షణ ప్రారంభించారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని టీజీఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించగా, మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# భర్త మోసం ఆరోపణలతో భార్యపై దాడి.. చెట్టుకు కట్టి అవమానం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 10, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో అంగన్వాడీ టీచర్‌పై దాడి ఘటన కలకలం రేపింది. హెచ్చీఎం ఫైనాన్స్ పేరుతో గ్రామస్తుల వద్ద డబ్బులు సేకరించి మోసగించి పరారైన దామరగిద్ద గ్రామానికి చెందిన ప్రభాకర్ భార్య వసంతకుమారి విధులకు హాజరైన సమయంలో, తాము మోసపోయామని ఆగ్రహంతో బాధితులు ఆమెను తాళ్లతో చెట్టుకు కట్టి అవమానపరిచారు. భర్త చేసిన మోసానికి సంబంధం లేకపోయినా మహిళపై ఈ విధంగా ప్రవర్తించడం పట్ల స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.



# ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 10, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి సందర్భంగా ఏప్రిల్ 11న ఉదయం 9 గంటలకు ఆర్ అండ్ బి కార్యాలయం సమీపంలోని పూలే విగ్రహానికి పుష్పమాలంకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. అనంతరం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కల్వకుంట రోడ్‌లోని నటరాజ్ థియేటర్ సమీపంలో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, బడుగు బలహీన వర్గాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# నగల్‌గిద్దలో విద్యుత్, తాగునీటి సమస్యలపై ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమీక్ష



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 10, ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నగల్‌గిద్ద మండల కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అధ్యక్షతన విద్యుత్ శాఖ మరియు తాగు-పారుదల (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో తాగునీటి కొరత, పైపులైన్, బోరు సమస్యలు, విద్యుత్ సరఫరా వ్యవధి, వోల్టేజ్ అస్థిరత, రైతుల మోటార్ల దెబ్బతినడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా గ్రామాలకు స్పష్టమైన లోడ్ షెడ్యూల్ ఇవ్వాలని, సాగుకు అనుకూలంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం గ్రామస్థాయి హెల్ప్‌డెస్క్‌లు, కాల్ సెంటర్లు, వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే తాగునీటి ట్యాంకులు, పైపులైన్లు, బోరు పంప్‌సెట్ల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సమీక్ష నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏప్రిల్ 13–18 వరకు 'అర్రైవ్, అలైవ్' రోడ్ సేఫ్టీ కార్యక్రమాలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 10, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో ఏప్రిల్ 13 నుంచి 18 వరకు నిర్వహించనున్న 'అర్రైవ్, అలైవ్' రోడ్ సేఫ్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడిన ఆయన, రహదారి ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీల ఏర్పాటు చేయాలని, అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తే ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో జానకి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు – జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 10, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వసంతరావు ఆధ్వర్యంలో నర్సింగ్ కళాశాల నుంచి డీఆర్‌డీఏ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించగా, వైద్య సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మైత్రి క్లినిక్‌లో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి సుమారు 45 మందికి హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ, సిఫిలిస్ తదితర పరీక్షలు, మానసిక ఆరోగ్య సేవలు అందించారు. కంది సెంట్రల్ జైలులో సుమారు 600 మంది ఖైదీలకు హెచ్ఐవీ, టిబి తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. హెచ్ఐవీ నివారణకు అవగాహన, ముందస్తు పరీక్షలు, సమయానికి చికిత్స ఎంతో కీలకమని డా. వసంతరావు తెలిపారు.

## బొమ్మరెడ్డిగూడెంలో లైబ్రరీ రీడింగ్ రూమ్ మంజూరు చేయాలి



సందేశం టైమ్స్, చౌటకూర్, ఏప్రిల్ 10, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం బొమ్మరెడ్డిగూడెం గ్రామంలో ప్రజల సౌకర్యార్థం లైబ్రరీ రీడింగ్ రూమ్ మంజూరు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్ వినతి పత్రం సమర్పించారు. గురువారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్యను కలిసి బాబూలాల్ రాజు నాయక్‌తో కలిసి ఈ విజ్ఞప్తి చేశారు. గ్రామ యువతకు వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, పోటీ పరీక్షల పుస్తకాలు చదివేందుకు రీడింగ్ రూమ్ ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

## ఎయిడ్స్ నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలి – జిల్లా కలెక్టర్ పిలుపు




సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 10, ప్రతినిధి: ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారంలో నాల్గవ రోజైన AIDS awareness prevention campaign day, RED RUN కార్యక్రమాన్ని కలెక్టర్ సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జెండా ఊపి ప్రారంభించి స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వరకు నిర్వహించారు. ర్యాలీ సమయంలో "ఎయిడ్స్‌పై అవగాహన – జీవన రక్షణ", "సురక్షిత జీవితం – ఆరోగ్య భవిష్యత్తు" వంటి నినాదాలతో ప్రజలకు సందేశాలు అందించారు. బ్యానర్లు, పాంప్లెట్లు ద్వారా వ్యాధి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు.కలెక్టర్ అన్నారు, HIV/AIDS పై సరైన అవగాహన కల్పించి వ్యాధి వ్యాప్తి విధానాలైన రక్త మార్పిడి, సూదులు/సిరంజిలు, తల్లి నుండి పిల్లకు సోకకుండా గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా HIV పరీక్షలు చేయించుకోవాలి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ-ప్రైవేటు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, పారా మెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు సమన్వయంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించి వ్యాధి వ్యాప్తి నివారించాలి.జిల్లా వైద్య మరియు ఆరోగ్యాధికారి డా. పెండెం వెంకట రమణ తెలిపారు, HIV/AIDS వ్యాధి సంక్రమించుకునే లక్షణాలు ఉన్నా, అసురక్షిత లైంగిక సంబంధాల వల్ల వ్యాప్తి చెందుతుంది, అందుకే నిరోధకాలను ఉపయోగించడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కీలకం. సూర్యాపేట, హుజూర్ నగర్ సబ్ జైల్లో ఖైదీలకు ART, HIV/Hb-B, TB పరీక్షలు, ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక వైద్య శిబిరంలో 52 మందికి పరీక్షలు నిర్వహించబడ్డాయి. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల శిక్షణార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయబడ్డాయి.కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి మొరిశెట్టి, వైస్ చైర్మన్ ఎండి షఫీ ఉల్లా, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్వో డా. చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు నాజియా, శ్రీశైలం, శ్రావణి ART మెడికల్ ఆఫీసర్, డా. శాంత కుమార్, అమూల్య, ప్రణీత్, వాసవి, వార్డ్ కౌన్సిలర్లు రాజేశ్, ఈద ప్రవీణ్, మాణిక్యం అరుణ, ఎస్ఓ పి వీరయ్య, డిప్యూటీ డిఇఎమ్ఓ సంజీవ్ రెడ్డి మరియు మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



## సూర్యాపేట జడ్పీ సీఈఓగా డి. శిరీష పదోన్నతి

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 10, ప్రతినిధి: సూర్యాపేట జిల్లాలో జెడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న డి. శిరీషను జెడ్పీ సీఈఓగా పదోన్నతి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, పదోన్నతి పొందిన సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## పెళ్లి కానుకగా ఆర్థిక సాయం అందించిన ఐలాపురం నాగరాజు



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, ఏప్రిల్ 10, ప్రతినిధి: ఇంద్రేశం మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఐలాపురం నాగరాజు ముదిరాజ్ సామాజిక సేవలో భాగంగా ఆర్థిక సహాయం అందించారు. వికర్ సెక్షన్ కాలనీకి చెందిన చంద్రయ్య ముదిరాజ్ కుమార్తె పెళ్లి సందర్భంగా ఆ ఆడపడుచుకు పూస్తే మెట్టెలు, నగదు రూపంలో సహాయం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన సేవా భావాన్ని ప్రశంసించారు.

## గొల్లగూడెం ఉత్సవాలకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు ఆహ్వానం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 10, ప్రతినిధి: ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శ్రీశ్రీశ్రీ బ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, ఎల్లమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను గొల్లగూడెం కుర్మ సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాల వివరాలను ఎమ్మెల్యేకు తెలియజేయగా, తప్పకుండా హాజరవుతానని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ దేవతల ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొంటూ ఇలాంటి పుణ్య కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కుర్మ సంఘం నాయకులు, వార్డు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రబీ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 10, ప్రతినిధి: రబీ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కె. సీతారామరావు అధికారులను ఆదేశించారు. గురువారం చివ్వేంల మండలంలోని రాంకోటి తండా, సూర్యాపేట మండలంలోని రాయినిగూడెంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కేంద్రాలను తనిఖీ చేసి కొనుగోలు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని సూచించారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో తేమ శాతం, తాలు, తరుగు సమస్యలు లేవని, అందువల్ల ఆలస్యం చేయకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని తెలిపారు. హమాలీల కొరత లేకుండా చూడాలని, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఓపిఎంఎస్‌లో నమోదు చేసి ఆలస్యం లేకుండా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించి, తేమ శాతం కొలిచే పరికరాలు, బరువు కొలిచే యంత్రాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్లు చంద్రశేఖర్, కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మేలు – కలెక్టర్ పిలుపు

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 10, ప్రతినిధి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మేలు జరగేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం సూర్యాపేట రూరల్ మండలం ఎర్కారం గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తో కలిసి కలెక్టర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటివరకు 281 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా, వడ్ల మిల్లుల గుర్తింపు పూర్తిచేశారు. ప్రతి కేంద్రంలో వేయింగ్ మిషన్లు, మాయిశ్చరైజింగ్ మిషన్లు, త్రాగునీరు, టెంట్లు, అవసరమైతే టార్పలిన్ పట్టాలు, ట్యాజింగ్ మిషన్లు, కాలిబర్ స్కేల్స్ ఏర్పాటు చేశారని కలెక్టర్ తెలిపారు.కలెక్టర్, మండల స్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటీలు, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి పర్యవేక్షణ చేస్తున్నారు అని చెప్పారు. ఎలాంటి జాప్యం లేకుండా కాంటాలు వేయాలని, ఆకాశంలో అకాల వర్షాల అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పిఎసిఎస్ అధికారులను కలెక్టర్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు మోహన్ బాబు, శ్రీధర్, జిల్లా కోపరేటివ్ అధికారి ప్రవీణ్, పిఎసిఎస్ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అరైవ్-అలైవ్' వారోత్సవాల కార్యక్రమం విజయవంతం చేయాలి – రాష్ట్ర సీఎస్ ఆదేశం



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 10, ప్రతినిధి: 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 13 నుండి 18 వరకు జరగనున్న 'అరైవ్-అలైవ్' వారోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులకు ఆదేశించారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, డీసీపీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో రోడ్డు ప్రమాదాల ద్వారా ప్రాణాలు కోల్పోతున్న ప్రజలకు అవగాహన కల్పించి ప్రమాదాలను తగ్గించాల్సిన అవసరం ఉన్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ మాట్లాడుతూ, హైదరాబాద్ నుండి విజయవాడకు వెళ్లే ప్రధాన జాతీయ రహదారిలో అధిక ప్రమాదాలు ఉన్నందున, నేషనల్ హైవేపై గుర్తించిన 32 'బ్లాక్ స్పాట్' లలో పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు, ప్రతి మంగళవారం జిల్లా, మండల స్థాయిలో రోడ్డు భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రమాద నివారణ చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ కె సీతారామారావు, సిపిఓ కిషన్, ఆర్డీవో జయప్రకాశ్ రెడ్డి, డిఇఓ అశోక్, డిఎంహెచ్వో పి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్యశ్రీ రోగులకు ప్రాధాన్యం ఇవ్వాలి – కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 10, ప్రతినిధి: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స కోసం వచ్చే రోగులకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూర్యాపేటతో పాటు కోదాడ, హుజుర్నగర్, తుంగతుర్తి ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచాలని సూచించారు. వైద్యులు మానవత్వంతో సేవలందించాలని, డ్యూటీ సమయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రుల్లో మౌలిక వసతుల లోపాలపై వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి పి వెంకటరమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. శ్రవణ్ కుమార్, ఇతర వైద్యులు, ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు



# సందేశం టైమ్స్ అభివృద్ధి కోసం సంగమేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజలు

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 10, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలోని ఝురాసంగం శ్రీ కేతకి సంగమేశ్వర్ ఆలయంలో సందేశం టైమ్స్ పేపర్, యూట్యూబ్ ఛానల్ మరింత ప్రజల్లోకి విస్తరించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సందేశం టైమ్స్ సీఈఓ శెట్టి వెంకటేశం సతీమణి అమృత జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ టి సంగమేశ్వర్, అందోల్ నియోజకవర్గ ప్రతినిధి కే మల్లేశం గౌడ్, మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ మన్నే పోచయ్య తదితరులు పాల్గొన్నారు. అమృతకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ మరెన్నో సంతోషకరమైన సంవత్సరాలు జరుపుకోవాలని ప్రార్థించారు.

# ఎయిడ్స్‌పై అవగాహనతోనే నివారణ సాధ్యం




సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 10, ప్రతినిధి: ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించడం ద్వారానే సమాజాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా నాలుగో రోజు ఎయిడ్స్ అవగాహన దినోత్సవం కింద నిర్వహించిన "రెడ్ రన్" కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రాందాస్ చౌరస్తా వరకు నిర్వహించిన వాకథాన్ ర్యాలీ ద్వారా ఎయిడ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పూర్తిగా నయం కాకపోయినా, సరైన జాగ్రత్తలతో వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, సంక్రమిత రక్త మార్పిడి, వాడిన సిరంజీల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుందని వివరించారు. జిల్లాలో హెచ్ఐవీ బాధితులకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏఆర్టీ కేంద్రంలో అవసరమైన చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ప్రజలు భయపడకుండా హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని, అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని వ్యాధిపై సరైన సమాచారం తెలుసుకోవాలని సూచించారు. ర్యాలీలో వైద్య అధికారులు, ఆశా సిబ్బంది, ఏఎన్ఎంలు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో ప్రజలకు సందేశం అందించారు.

# విద్యుత్ ఆర్టిసన్ ఉద్యోగుల సమ్మెకు బీఆర్ఎస్ సంఘీభావం



సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 10, ప్రతినిధి: తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చేపట్టిన నిరవధిక సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీ విప్ పి. నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆదేశాల మేరకు సమ్మె చేస్తున్న ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్నామని, వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల విద్యార్హతలకు అనుగుణంగా కన్వర్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, దాసరి దుర్గేశ్, పల్లే వెంకట రమణ, ఎం.డి. రఫిక్ పాల్గొన్నారు. జోగిపేట డివిజన్ పరిధిలోని ఆర్టిసన్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు



సందేశం టైమ్స్, బోనకల్, ఏప్రిల్ 10, ప్రతినిధి: మొక్కజొన్న కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆరోపించారు. బోనకల్ రెవెన్యూ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా నిర్వహించి రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర రూ.2400 అందేలా చూడాలని, ఎకరానికి 26 క్వింటాళ్ల పరిమితి నిబంధనను రద్దు చేసి రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, విస్తృతంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. రైతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బానోత్ కొండ, రైతు నాయకులు వేమూరి ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# రైతులు ఆధునిక సాంకేతికత వినియోగంతో ఆదాయం పెంచుకోవాలి

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 10, ప్రతినిధి: రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని, పంట వివిధీకరణ ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖలు, లీడ్ బ్యాంక్, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. వరి వంటి సంప్రదాయ పంటలపై ఆధారపడకుండా పప్పుధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, పండ్ల పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, పంటల మార్పిడి ద్వారా నేల ఆరోగ్యం, నీటి వినియోగంలో మితవ్యత సాధ్యమవుతుందని వివరించారు. పశుసంవర్ధక శాఖ గాలి కుంట వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మత్స్యశాఖలో ఖాళీలను గుర్తించి భర్తీ చేయాలని, మత్స్యకార సంఘాలకు చేపల పెంపకం, ఉపాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే కొత్త సంఘాల నమోదును ప్రోత్సహిస్తూ మహిళలకు చేప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా పామాయిల్ పంటపై రైతులు మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో పామాయిల్ విస్తీర్ణాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు



# అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 10, ప్రతినిధి: ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించనున్న "అరైవ్ అలైవ్" వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. డీజీపీ శివధర్ రెడ్డి అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావుతో కలిసి పాల్గొని, ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ సభలు, విద్యార్థుల ర్యాలీలు, వాహనదారులకు కంటి పరీక్షలు వంటి కార్యక్రమాల ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.



# కలెక్టర్‌కు భద్రాచలం కల్యాణ తలంబ్రాలు అందజేసిన ఆర్టీసీ అధికారులు

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 10, ప్రతినిధి: మెదక్ జిల్లా తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ రీజనల్ మేనేజర్ విజయభాస్కర్, మెదక్ ఆర్టీసీ డీఎం సురేఖతో కలిసి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ తలంబ్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సమర్థవంతంగా వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఈ పథకం విజయవంతంగా అమలవుతున్నందుకు ఆర్టీసీ అధికారులను అభినందించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.